మూడు వంతులు
నీరున్న
ఈ భూమ్మీద
అతని దాహం
తీరలేదెందుకని?

సదానంద్ శారద కథ

# కాకి ఒకటె నీళ్లకు....

అవి వల్లాలకు నీళ్ల రాక జనం కళ్లలోకి నీళ్ల వచ్చి దిగులు పడుతున్న రోజులు.

ఇంటిల్లిపాది రోజూ స్నానం చేయడం లగ్జరీ అయిన రోజులు.

ఆ వీధిలోకి ఎక్కణ్నుంచో ఒక కొత్త కుక్కపిల్ల వచ్చింది...

గయ్మన ఆ వీధి కుక్కలన్నీ దాని వెంటపడ్డాయి. పాపం! ఆ కుక్కపిల్ల క్షమించండి తప్పయింది వెళ్ళిపోతాను అని తెల్లజెండా వూపినట్లు తోక ముడుచుకుంది. అయినా ఆ కుక్కలు వూరుకోలేదు. మీదపడి రక్కేంత కసితో ఆ కుక్కపిల్లను తరుముతున్నాయి.

ఈ వీధి మాది అన్న ధీమాతో తోకలు రిక్కించి మరీ మొరుగుతున్నాయి.

వాటి సంఘీభావం చూడాలంటె ఇలాంటప్పుడే.

ఆ కుక్కపిల్ల.

దానివెంట ఆ వీధికుక్కలు మొరుగుతూ పరిగెడుతున్నాయి. వాటికోరపళ్లు భయంకరంగా రాక్షసులను తలపించేవిగా ఉన్నాయి... వాటి అరుపులు కర్ణకఠోరంగా ఉన్నాయి.

ఓ అడుక్కునే అబ్బాయి—

నిండా పదేళ్ళయినా లేవు. చినిగిన గుడ్డలు చింపిరి తల ఎండిపోతున్న గొంతు.

తిండి సంగతి దేవుడెరుగు — ముందు దాహంతో నాలుక పిడుచగట్టుక పోతువ్నది.

దాహం తల్లీ కాసిన్ని నీళ్ల పోయండి అని అడిగితె ఏ తల్లికి మాత్రం దయ, అడుక్కునే ఆ పసికూన మీద అపలే నీళ్లకు



కట కట పడుతున్న కరువు రోజులు! చెంబెడు నీళ్ల తీరిగ్గా దానం చేయడమంటె మాటలు కాదు. ఎవరి హడావుడిలో వాళ్ళున్నారు. ఎవరి ఆవేదనలో వాళ్ళున్నారు.

గల గలా గోదారి మనకుంది. కళ కళలాడే కృష్ణమ్మ మనకుంది అయినా వీళ్లకు కరువుంది!

అన్నపూర్ణమ్మలు, దానకర్ణులు కనిపించకపోయినా ఓ దయగల తల్లి కనిపించక పోతుందా కాసిన్ని నీళ్ల పోస్తే గొంతు తడుపుకుందామని ఆ అబ్బాయి ఓ ఇంటిముందు నుంచున్నాడు.

తరమబడుతున్న కుక్కపిల్ల రయ్‌మంటూ అతన్ని తాకుతూ దూసుకపోయింది.

దానివెంట ఒకటా, రెండా అరడజను కుక్కలు లేడిపిల్లను తరుముతున్న నక్కల్లా, పులుల్లా, సింహాల్లా లంఘిస్తూ వచ్చాయి.

తన మీదికే ఆ కుక్కలు వస్తున్నట్టు భయపడి ఆ అడుక్కునే అబ్బాయి సోములు అరుస్తూ పరుగులంకించుకున్నాడు. పరుగెత్తి పరుగెత్తి .. కొంతదూరం వెళ్ళి వెనక్కు తిరిగి చూశాడు.

కుక్కలు కనిపించలేదు.

తమ సరిహద్దు రాగానే అవి వెనక్కు వెళ్ళిపోయాయి. తరమబడిన కుక్కపిల్ల సురక్షితంగా తన స్సామ్రాజ్యం చేరుకుంది.

పరుగు ఆపినా ఇంకా పరుగెదుతున్నట్టె సోములు శరీరం వూగిపోతున్నది. గుండె వేగంగా కొట్టుకుంటున్నది. తనను ఇంకా కుక్కలు తరుముతున్నట్టే బెదిరిపోతున్నాడు. భయంతో వణికి పోతున్నాడు. ఒంటినిండా చెమటలు పట్టాయి.. గొంతు మరింత తడారిపోయింది.

ఆ ప్రాంతంలో వుండటానికే భయపడి నీళ్ల అడుక్కొని తాగుదామనె ఆశతో కొత్త వీధిలోకి అడుగుపెట్టాడు.. అయినా కుక్కలు తనను ఇంకా తరుము తున్నట్టె అటుఇటు బెదిరిబెదిరి చూస్తున్నాడు.

ఆకాశం నిర్మలంగా ఉంది. వర్షాకాలంలో కూడా అలా నిర్మలంగా ఉండే కదా జన జీవితానికి నిమ్మలం లేకుండా చేసింది.

అప్పుడప్పుడు ఉరుములు వినిపించినా అవి నాయకుల వాగ్దానాల్లాంటివే ప్రయోజనంలేని ఉరుములు

నీటికి ఎన్నడూ లేనంత కరువు!

గోడలు నింపేవాళ్లకు చేతినిండా పని. గవర్నమెంట్ డౌన్ డౌన్ గవర్నమెంటుకు నోటినిండా పని మాజీ గవర్నమెంట్ డౌన్ డౌన్..

ఎవరు డౌన్ డౌన్. ఎవరుఅప్ అప్.. ఆలోచించే తీరికలేదు. జనం అలసిపోయారు. అసలే బతుకుల్లో అంతంత తడి ఇప్పుడు నీటి తడి కూడా కరువయింది. ఆలోచనలు..అరుపులు పక్కకు పెట్టి బిందెలు, బకెట్లు చేతపట్టుకొని బోరింగ్ పంపులముందు క్యూల్లో నిల్చున్నారు.

ప్రతి వీధిలోనూ అవే దృశ్యాలు. కంగారుగా అటుఇటు తిరిగే ఖాళీ బిందెలు, బకెట్లు..దిగాలు పడిన మొహాల్తో జనం.

''.....ఈ ప్రపంచం ఎంతో విచిత్రమైనది. ఈ భూగోళమే ఒక వింత గోళం. మూడొంతులు సముద్రం ఒకవం తు మాత్రమే భూమి కనిపిస్తుంది. అందుకే దీన్ని జలగోళం అంటారు.

మనదేశంలో అపారమైన జలవ నరులున్నాయి.....''

''కట్టేయిరా ఆ రేడియో'' ఆ ఇంటి

యజమాని కోపంతో అన్నాడు.

"ఆగు నాన్నా ఆ తరువాత ఏం చెబుతారో విందాం". అన్నాడు కొడుకు.

నీళ్లకోసం ఆ ఇంటి ముందు మంచున్న సోములుకు వారి సంభాషణ వినబడుతున్నది.

"అయినా ఏం లాభం. మనకున్న జలవనరుల్లో మూడొంతులు సముద్రంలో వృధాగా కలిసిపోతున్నాయి.."

"ఏవిటి రేడియోలోనే ఆ మాట!!!"

"అవును నాన్నా..."

"రేడియో కూడా నిజం మాట్లాడ్తుందిరా!!" ఆశ్చర్యంగా అడిగాడు తండ్రి.

"అవుమ నాన్నా"

"అయితే రేడియో కట్టేయకురా. ఆ తరువాత ఏం చెబుతుందో విందాం".

"మనదేశం...' రేడియో ఆగిపోయింది.

"ఏమయిందిరా?"

"కరెంట్ ఆఫ్ నాన్నా"

'ప్చ్! నీళ్ల లేకపోతె ఎన్ని ఇబ్బందులో చివరికి కరెంటుకూడా కోత"

"నాన్నా ఇంట్లో నీళ్ళ చుక్క లేదు. బోరింగ్ దగ్గరికి పోతున్నా.."

"జాగ్రత్తరా నాయనా అక్కడ ఎవరితోనూ గొడవ పెట్టుకోకు.."

తండ్రి కొడుకులు సంభాషణ విన్నాక తనకు ఆ ఇంట్లో నీళ్ల దొరికే అవకాశం వున్నట్లు కనిపించలేదు. పక్కింటి ముందు దీనంగా నిలుచున్నాడు సోములు.

ఆ ఇంట్లోంచి పొగలు సెగలు. వంటింటివి కాదు వొంటివి.

రెండు రోజుల్నుంచి ఆ ఇంట్లో భార్యాభర్తలమధ్య ఒకటే గొడవ.

"...నీళ్ల టాంకర్ వచ్చినపుడు అంత పలుచని తెల్లచీర కట్టుకొని నీళ్లకు పోతావా! భుజంమీద ఎన్ని నీళ్లో ఒంటిమీద అన్ని నీళ్లా! తడిసి ముద్దయి బజారున నడిచి నా పరువు తీస్తావా.." అని భర్త.

"ఇన్ని మాటలనకపోతె ఆ నీళ్ళు నువ్వే తేరాదు. నాకేం సరదా అనుకున్నావా బట్టలు తడుపుకొని బజార్లోంచి నీళ్ల తేవడం? ఎండాకాలం కదా చల్లగా ఉంటుందని తెల్లనూలు చీరె కట్టుకున్నాను. అయినా అప్పుడు టాంకర్ వస్తుందని నాకేం

## విన్నారి రికార్డు




కొందరికి ఏదో ఒక రికార్డును సృష్టించడం సరదా! అయితే ప్రపంచ రికార్డులతోపాటు... కొంత పుణ్యాన్ని కూడా సంపాదించుకుంది ససెక్స్‌కు చెందిన 12 ఏళ్ల బాలిక వార్మన్. 1982వ సంవత్సరంలో జూన్‌లో... 'బైబిల్'ను పూర్తిగా చదవడంద్వారా ఈ రికార్డును సాధించింది విన్నారి. అయితే బైబిల్‌ను చదవడమే రికార్డను కుంటున్నారా? కాదండోయ్! బైబిల్ గ్రంథంలోని ఎండ్ (AND) అనే పదం 46,227 సార్లు ఉన్నదని వెల్లడించడమే ఈ విన్నారి సృష్టించిన బుర్రి రికార్డు.

జూపిటర్.

తెలుసు. రోజూ సాయంకాలం వచ్చేది. ఆరోజు మధ్యాహ్నమే వచ్చింది. నేను చీర మార్చుకొని వెళ్ళేదాకా ట్యాంకర్ ఉంటుం దా ముందుగా చేరిన అమ్మలక్కలు నన్ను నీళ్ల పట్టనిస్తారా. అందుకే గబగబా వెళ్ళా. నీ కోసమే కదా వెళ్ళింది'' అని భార్య.

''నా కోసమా!''

''కాకపోతె తెచ్చిన నీళ్ళన్నీ నేను ఒక్కదాన్నే తాగుతున్నానా? బోరింగ్ నీళ్ల ఉప్పులయినా సరే నేను తాగగల్ను కాని నువ్వు తాగుతావా?. స్నానం కూడా చేయవు. నీకోసం అంతకష్టపడి నీళ్ల తెస్తె నన్ను ఇన్ని మాటలంటావా?''

''నేనేమన్నా అబద్ధం మాట్లాడానా చెప్పు. నీ చీర తడిసి ముద్దయిందా లేదా?''

''అవును కాని అది కావాలని చేసిన పనికాదు గదా..''

''కాని..వీధిన పోయే ప్రతి.''

''చూసే ఆ మూర్ఖులను తిట్టండి పనిపాట చేసుకునే ఆడవాళ్ళను ఆబగా చూసే పురుగులకు గడ్డి పెట్టండి అంతేకాని నన్నేమన్నా అంటే ఊర్కునేది లేదు.''

''ఊర్కునేది లేదా.అంటె ఏం చేస్తావే? తిడతావా? మీదపడి కొడ్తావా'' మూలనున్న కర్రతీసుకొని భార్యమీదికి వెళ్ళాడు భర్త.

ఆమె లబోదిబోమన్నది.

'అమ్మా దాహం' అనే సోములుకు వాళ్ళు నీళ్లపోయగలరా!''

పాపం ఆ కుర్రాడు సోములు

పిడుచగట్టుకపోతున్న నాలుకతో, ఉమ్మితో బలవంతంగా తడుపుకుంటున్న గొంతుతో మరో ఇంటిముందు గుక్కెడు నీళ్లకోసం దీనంగా నిల్చున్నాడు.

''అమ్మా దాహం...'' అనడానికే ఆ అబ్బాయికి గొంతు పెగలటంలేదు.

ఆ ఇంట్లో ఇద్దరన్నదమ్ములు కాపురముంటున్నారు. వారి భార్యలు తోడబుట్టిన అక్క చెల్లెళ్లలా. స్నేహితుల్లా కలిసి ఉంటూ ఇంతకాలం ఆ వీధికే ఒక ఆశ్చర్యకరమైన విషయమైపోయారు.

ప్రస్తుతం వారి మధ్య పచ్చగడ్డి అది దొరక్కపోతె ప్లాస్టిక్ గడ్డి వేసినా భగ్గుమంటోంది.

చుట్టూ బోరింగ్‌లు రావటం వల్ల ఆ ఇంట్లోని బావి ఎండిపోయింది.

బజారు బోరింగ్ నీళ్ల తెచ్చి డ్రమ్ముల్లో నింపుకుంటున్నారు. రెండిండ్లకు కామన్ బాత్‌రూం, లావెటరీ తగాదా ఎక్కడంటె ఒకరి డ్రమ్ముల్లో నీరు మరొకరు వాడుకుంటున్నారని అనుమానం అల్లరి.

రామ లక్ష్మణుల్లా కలిసి వున్న ఆ అన్నదమ్ములు భార్యల మూలంగా వాలి సుగ్రీవుల్లా తగవులకు తయారయ్యారు. కత్తుల దాకా వచ్చింది వ్యవహారం.

ఆ తగాదా వింటూ దాహం అని అడగలేకపోయాడు సోములు. అడిగితే గవర్నమెంటు హాస్పటల్ పాలయ్యేవాడు.

కుక్కల భయంతో పరుగెత్తి పరుగెత్తి కొత్త ప్రాంతంలో అడుగుపెట్టాడు. అడుక్కోడానికి ఆ అబ్బాయి ఎప్పుడూ ఆ వీధికి రాలేదు.

ఆశగా పబ్లిక్ నల్లావైపు చూశాడు. చుట్టూ ఎక్కడా తడి అనేది లేదు.

ఎండిపోయిన సిమెంట్ గచ్చు తెల్లగా కనబడుతున్నది. పటం మీద నదుల్లా ఆ గచ్చుమీద నల్లని గీతలు కనిపిస్తున్నాయి. కాకి ఒకటి నల్లామీద కూర్చుని కావు కావుమని అరుస్తున్నది.

దూరంగా వున్న బోరింగ్ వైపు చూశాడు సోములు. పావు కిలోమీటరు పొడుగున్నా వుంటుంది నీళ్లకోసం లైను. అక్కడ తనకు గుక్కెడు నీళ్లు దొరుకుతాయా! ఊహూ.

రేషన్ షాపులముందుకాని, కొత్త సినిమా బుకింగ్ ముందుకాని, పేరు మోసిన దేవుడి గుడిముందుకాని, కనీసం పోలింగ్ బూత్ ముందుగాని అంత క్యూ ఉండదు.

ఆకలికంటే దాహం బాధ భరించలేనిది. ప్రాణాలను నిలువునా లాగేస్తున్నది. తనకు గుక్కెడు నీళ్లెవరు పోస్తారు. నోరువిప్పి అడగాలంటేనె భయంగా ఉంది.

ఒకప్పుడు తినడానికి తిండి దొరక్కపోయినా గవర్నమెంటు పంపునీళ్లతోనైనా కడుపునిండేది. ఇప్పుడు అది లేదు ఇదీ లేదు.


పక్షులు ఎంత పుణ్యం చేసుకొని పుట్టాయోకదా దేవుడు వాటికి రెక్కల్ని ఇచ్చాడు. నీళ్లకోసం ఎంత దూరమున్నా ఎగిరిపోగలవు.

తాను ఓ పిచ్చుకైతె ఏ నీళ్ల డ్రమ్ము మీదో వాలిదాహం తీర్చుకునేవాడు. ఏ చీమనో అయితే తాగిపెట్టిన గ్లాసులోని నీటి బిందువునైనా తాగేవాడు.

దాహం..దాహం...నోరు ఎండిపోతున్నది.

ప్రాణాలు బిగపట్టుకొని కొనవూపిరితో బరువుగా అడుగులు వేస్తున్నాడు సోములు.

గాలి తరువాత నీరే కదా శరీరానికి ముఖ్యం. దాహంతో అలమటించే సోములు కాళ్ళు నీరసంతో వణుకుతున్నాయి. కళ్లకు చీకట్లు కమ్ముతున్నాయి. కళ్లు ఎండిపోయిన గుంటల్లా లోతుకు పోయాయి. నోటిలో కనీసం లాలాజలం కూడా లేదు గొంతు



తడుపుకోడానికి.

బలవంతంగా ఏదో మింగినట్టు చేస్తే రక్తం తగులుతున్నంత చేదుగా ఉంది గొంతు. మంటగా కూడా ఉంది. కళ్లకు కనుగుడ్లె బరువయ్యాయి.

దాహం. భరించలేని దాహం..

అవి ఎంతటి మురికి నీళ్లైనా సరే కనిపిస్తే చాలు గొంతు తడపుకోవాలని ఆశగా..దిగులుగా..దీనంగా చూస్తున్నాడు సోములు.

ఇది వరకటిలా ఆరు బయట నీళ్ల డ్రమ్ములు లేవు. ధనాన్ని, ధాన్యాన్ని దాచుకున్నట్టు నీళ్ల డ్రమ్ములని కూడా. ఇళ్లలోనే దాచుకుంటున్నారు జనం.

ఎక్కడో ఒకచోట బాత్‌రూంల ముందు ఉన్నా ఆ డ్రమ్ములమీద భద్రంగా మూతలు పెట్టివున్నాయి.

నీళ్లకోసం జనం ఎంత శ్రమపడుతున్నారో, ఇబ్బంది పడుతున్నారో దాన్నిబట్టి గ్రహించవచ్చు. శ్రమపడి సంపాదించే వాటినే కదా భద్రంగా దాచుకుంటారు.

బకెట్ నీళ్లు నిండడానికి ఎంత యమయాతన పడుతూ బోరింగ్ పంపు కొట్టాలో ఆ బాధ అనుభవించిన వాళ్ళకే తెలుసు.

ఎప్పుడూ ఎండకన్నెరుగని ఆడపడుచులు, బజారులోకి తొంగి చూడటానికే సిగ్గుపడే ఆడపడుచులు, నడివీధిలో ఆ బోరింగ్ పంపు కొట్టడానికి వంగి, లేస్తూ ఎంత అవస్థ పడుతున్నారో..

సోములు నోటమాటలేదు. గొంతు పెకిలే శక్తిలేదు. పెదవులు దూప...దూప అన్నట్టు కదులుతున్నాయి.

ఇండ్ల బయట ఉండే నీళ్ళ డ్రమ్ములకోసం, నీటి తొట్లకోసం బకెట్లకోసం ఆశగా చూశాడు. ఎక్కడో ఒకచోట కనిపించే వాటిమీద బరువైన మూతలున్నాయి.

ఆ మూత తీసేలోపలే ఎవరైనా చూశారంటె. ఒంట్లో వొణుకుపుట్టింది. తన్నులు...డొక్కలో... మొహం మీద..మూతిమీద..తలమీద.... రక్తం... రక్తం....

"అమ్మా..." భారంగా కళ్ళు మూసుకున్నాడు సోములు...దాహం భరించలేని దాహం.

రెండు రోజుల్నుంచి తిండిలేకపోయినా ఓర్చుకున్నాడు. కాని పొద్దుటినుంచి గుక్కెడు నీళ్ళకోసం యమయాతన పడుతున్నాడు.

విపరీతమైన ఎండ. భగభగమండుతున్న ఎండ మాడ కాలిపోతున్నది. శోషవచ్చి ఏ క్షణంలోనో పడిపోయేట్టుగా ఉన్నాడు సోములు.

మూతలు పడుతున్న కళ్లకు చీకటవుతున్న ఆ కళ్లకు ఓ దృశ్యం కనిపించింది. బలవంతంగా కళ్ళు విశాలం చేసుకొని చూశాడు.

ఆ ఇంటిపక్కన లావెటరీ ముందు సగం వరకు పగిలిపోయిన ఓ పాత సిమెంటు తొట్టి ఉంది. అప్పుడే ఆ ఇంటామె లావెటరీ

మంచి బయటికి వచ్చింది. తొట్టిలోని నీళ్ల లావెటరీలో పోసి కాళ్లు కడుక్కొని లోనికి వెళ్ళింది. సోములుకు పోతున్న ప్రాణాలు లేచి వచ్చినట్లయింది. ధైర్యం కూడగట్టుకొని ఆశగా అటువైపు అడుగులో అడుగు వేసుకుంటూ వెళ్ళాడు.

అది ఏం తొట్టి? అందులో నీళ్లెలా ఉన్నాయి? అదంతా అప్రస్తుతం నీళ్ల కనిపించాయి. అంతే చాలు. అందులోని మురికి..చెత్తా చెదారం ఈగలు, దోమలు పురుగులు అవేవీ కంటికి కనిపించలేదు.

ఆ తొట్టిలోని నీళ్ళలో ఓ ప్లాస్టిక్ చెంబు ఉంది.

ఆబగా ఆ చెంబుతో నీళ్ల ముంచి నోటి దగ్గర పెట్టుకోబోయాడు.

"ఒరేయ్ ఎవ్వడావీడు?" అన్న మాటలు వినిపించాయి.

అదిరిపడి చూశాడు..

ఆ వీధిలో అడుక్కునే పిల్లలు.

చేతిలోని చెంబు జారిపడింది.

గబుక్కున వంగి మళ్లీ చేతిలోకి తీసుకున్నాడు.

వీధిలో కొత్త బిచ్చగాన్ని చూస్తె పాతవాళ్ళు సహించరు. అసలే కరువు రోజులు తమకు దొరికేదే అంతంతమాత్రం మరో కొత్తవాడు వచ్చి చేరాడంటె ఆ దొరికేది కాస్త ఎక్కడ తమ్మకపోతాడేమోనని భయం..

"అరేయ్ ఇక్కణ్నుంచి పోతావా లేదా.."

"తమ్ముండ్లిరా లంమ్డికొడుకుని."

"ఏ వాడరా నీది?"

తన మీదికి వస్తున్న వాళ్ళను చూసి బెదిరిపోయాడు సోములు. అతి భయంకరంగా కనిపించారు వాళ్ళు చిక్కితే పీక్కు తినేలాగున్నారు.

శక్తినంతా కూడ దీసుకొని పరుగులంకించుకున్నాడు. ఆ బెదురులో చేతిలోని చెంబును అక్కడ పడేయడం మరచిపోయాడు.

చెంబుతో సహా పరుగెత్తుతున్నాడు.

అప్పుడే బయటికి వచ్చిన ఆ ఇంటి ఇల్లాలు చెంబుతో పారిపోతున్న ఆ కుర్రాడిని చూసి "దొంగ దొంగ" అని అరిచింది.

వీధిలోని నలుగురు పరుగెదుతున్న ఆ కుర్రాడి వెంట పడ్డారు.

తనను పట్టుకుంటారు. చిత్రవధ చేస్తారు. అని ముందు వెనక చూడకుండా బలం కొద్ది పరుగెదుతున్నాడు సోములు.. వేగంగా.. వేగంగా.. పడిపోబోతున్నా.. కళ్లకు చీకట్లు కమ్ముతున్నా ... పరుగు...పరుగు...పరుగు..ఎటు పరుగెత్తుతున్నది తెలియదు.

ఎదురుగా వస్తున్న నీళ్లటాంకర్ మోటర్‌కు సడన్ బ్రేకులు పడలేదు. డ్రైవర్ దృష్టిలో పడే లోపలే ఆ కుర్రాడిమీదుగా నీళ్ల టాంకర్ వాహనం దూసుకుపోయింది.

కెవ్వున కేక..

తల చితికిపోయింది. రక్తంమడుగు.

సోములు రక్తం మడుగులో గిలగిలా కొట్టుకొని ప్రాణాలు విడిచాడు.

కాకి ఒకటి కరెంటు తీగమీద వాలి జాలిగా చూస్తోంది....!!

*